

డిజిటల్ సర్వేలో సమస్యలున్నాయని టెక్నికల్ ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేస్తున్న ఏఈవోలు



# 'సర్వే'శ్వరా..!

- సందిగ్ధంలో డిజిటల్ క్రాప్ సర్వే
- క్షేత్రస్థాయిలో సమస్యలంటున్న ఏఈవోలు
- సర్వర్ పనిచేయక పోవడంతో కష్టాలు
- వినతిపత్రం ద్వారా సమస్యల మొర
- రైతుభరోసా ఎగనామాకేనంటున్న రైతులు

వనపర్తి, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ): జిల్లాలోని ఓ గ్రామంలో ఎకరా 27గుంటల భూమిలో 34మంది రైతులున్నారు. ప్రభుత్వం నూతనంగా చేయాలంటున్న డీసీఎస్ సర్వేలో దాదాపు పదిలోపు ఆప్షన్లున్నాయి. ఈ 34మంది రైతులను ప్రత్యేకంగా ఫొటో తీయాలి. పంట సాగును గుర్తించాలి. వరి అయితే ఎరకం, సాగునీటి వనరు, నాటు పద్ధతి ఎలా వేశారు వంటి సుమారు ఓ పది వరకు ఆప్షన్లు ఒక్క రైతు నుంచి సేకరించాలి. పైన కనబర్చినట్లుగా ఒక్కో రైతుకు ఆరగంటకు పైగా సమయం పడుతుంది. సర్వేనెంబర్ ప్రకారం పొలంలో కాలు పెడితేనే సర్వర్ ఓపెన్ అవుతుంది. రెండు మీటర్ల దూరంలో ఉన్నా యాప్ ఓపెన్ కాదు. ఇలా అనేక సమస్యల మధ్య డిజిటల్ క్రాప్ సర్వే కొనసాగుతుంది. జిల్లాలోని సాగు భూములను డీసీఎస్ ద్వారా గుర్తించి నమోదు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది సర్వేకు శ్రీకారం చుట్టింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు అనంతరం ఇప్పటి వరకు రైతుబంధు ఊసేలేదు. ఇటీవలే ఒకటి, రెండు ఎకరాలకు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అయితే, అది సంపూర్ణంగా సాగుతుందన్న పరిస్థితులు కనిపించడం లేదు. వేశామని ప్రభుత్వం చెబుతున్నా.. ఫోన్‌లకు మెసేజ్‌లు వచ్చి నా తీరా బ్యాంకులకు వెళ్లి చూస్తే.. డబ్బులు పడడంలేదని అనేక మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వినతిపత్రంతో సమస్యల మొర..**

జిల్లా వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఏఈవోలు డిజిటల్ క్రాప్ సర్వేలో ఉన్న సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని టెక్నికల్ ఇన్‌చార్జి వెంకటేశ్‌కు ఇచ్చి మొర పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో అనేక సమస్యలున్నాయని, సర్వర్ పనిచేయకపోవడం, రైతులు సహకరించకపోవడం, పొలాలకు వెళ్లినప్పుడు జన సంచారం లేకపోవడం, ఐదారేండ్ల కిందట ఇచ్చిన ట్యాబ్‌లు పనిచేయకపోవడంలాంటి వాటితో ఏవోలు సర్వే చేయడం కష్టమని తేల్చారు. తమకు కనీసం ఒక సహాయకుడిని ఇచ్చినా సర్వే చేయగలుగుతామని తమనొక్కరినే చేసుకురావాలంటే ఫీల్డ్‌లో చాలా ఇబ్బందులున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో సర్వే కనీసం 25 శాతం కూడా చేపట్టలేదు. పొలాలకు ఏఈవోలు వెళ్లినప్పుడల్లా రైతుభరోసాను ఎత్తివేయడానికే ఇదంతా అన్నట్లు రైతులు గుర్రుగా ఉండడంతో ఏఈవోలు నిస్సహాయులుగా మిగులుతున్నారు.

**బాటలు లేని పొలాలు..**

డిజిటల్ సర్వే చేయాలన్నా.. వ్యవసాయ పొలాలకు మార్గాలు సక్రమంగా ఉండవు. మరీ వరిపొలాల గట్లపై వెళ్లి సర్వే చేయాలంటే చాలాకష్టం. అందులో మహిళలకైతే నరకమే. సన్నటి ఒర్రాలు, నడవడానికి వీలులేకుండా ఉండే పరిస్థితిలో బురదను కొట్టుకోవడం తప్పా మరేం ఉండదు. ఇంకా బాలింతలు, గర్భిణులైతే అసలే కష్టం. గతంలోనే ఈ సర్వేపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అయినా కచ్చితంగా చేయాలని అధికారులు ఒత్తిడి చేసినప్పటికీ అంతంతమాత్రమే సాగింది. ప్రస్తుతం జిల్లాలోనూ సర్వేకు గడ్డు పరిస్థితులే ఏర్పడ్డాయి. ఇప్పటి వరకు కనీసం 25శాతం కూడా సర్వే పూర్తి కాలేదంటే క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలే కారణమని ఏఈవోలు చెబుతున్నారు. పొలాలకు వెళ్లి ఫోన్‌లు చేసినా రైతులు స్పందించక పోవడంతో సమస్యల సుడిగుండంలో సర్వే అన్నట్లు తయారైంది. గతంలోనూ ఇలాంటి సర్వేలను ప్రైవేట్ ఏజెన్సీలతో చేయించినప్పటికీ ఏడాది నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏఈవోలకు ఈ సర్వే పనిని అంటగట్టింది. అంతకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుబంధు 12 పర్యాయాలు వేసినా.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులు ఆర్థికసాయం అందుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎలాంటి సాయం అందకపోయినా సర్వేల పేరుతో కాలయాపన తప్పా మరొకటి లేదంటున్నారు రైతులు.

**మహిళా ఏఈవోలు 32 మంది..**

జిల్లాలో మొత్తం 72మంది ఏఈవోలు పని చేస్తున్నారు. వీరిలో దాదాపు 32మంది మహిళా ఏఈవోలు కొనసాగుతున్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన డీసీఎస్ వీరికి ఇక్కట్లను తెచ్చిపెట్టింది. ఇలా మహిళా ఏఈవోలు ఒంటరిగా వెళ్లాలన్నా.. వరిచేల గట్లపై పోవాలన్నా.. బాటలులేని పొలాలకు చేరుకోవాలన్నా చాలాకష్టం. తీరా అక్కడికి వెళ్లాక సర్వర్ డౌన్ అంటే ఇక అంతే సంగతులు. అష్టకష్టాలు పడి పొలం దగ్గరకు చేరుకున్నా.. యాప్ సహకరించకపోతే ఆరోజు ఖతం అయినట్లే. మోటర్ సైకిల్‌పై గ్రామానికి చేరుకున్నా.. కచ్చితంగా ప్రతి సర్వేనెంబర్ పొలంలోకి కాలు పెడితేనే యాప్ ఓపెన్ అవుతుంది. ఈ క్రమంలో ఏఈవోలు తమకు సర్వే చేయడం కష్టంగా మారిందంటూ ఆరోపిస్తున్నారు.

## గిరిజనుల పితామహుడు సేవాలాల్



గిరిజనులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 15: గిరిజన జాతికి గొప్ప సంఘ సంస్కర్త, పితామహుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ చౌరస్తాలో సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఉత్సవాలకు మాజీ మంత్రి హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలు వేసి పూజలు చేశారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ.. గిరిజన జాతికోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గిరిజనులు ఆరాధ్య దైవంగా భావించే సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. సేవాలాల్ ఆలోచనా విధానాలను ముందుకు తీసుకుపోయే బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. గిరిజనులకు రాజ్యాధికారం కల్పించేందుకు కేసీఆర్ ప్రభుత్వంలో తండాలను జీపీలుగా మార్చినట్లు వెల్లడించారు. తండాల్లో తాగునీటికి అనేక ఇబ్బందులు ఉండేవని.. తన హయాంలో నియోజకవర్గ పరిధిలోని తాగునీటి సౌకర్యం, రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, జీపీ భవనాలు, క్రీడా ప్రాంగణాలతోపాటు పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామన్నారు. పట్టణంలోని పద్మావతి కాలనీలో గిరిజన భవనంతోపాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలంతోపాటు రూ.1.10 కోట్ల నిధులు మంజూరు చేసి పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. విద్యార్థులు చదువుకునేందుకు ప్రత్యే వసతిగృహాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. అనారోగ్యంతో బాధపడే గిరిజన, మధ్య తరగతి బిడ్డల కోసం బస్టాండ్ ఎదుట అతి పెద్ద దవాఖాన నిర్మాణంలో ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు శివరాజ్, నాయకులు మనోహర్‌నాయక్, రమేశ్‌నాయక్, కిషన్ పవర్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ బాట ఆదర్శనీయం



మద్దూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూర్ (కొత్తపల్లి), ఫిబ్రవరి15: సంత్ సేవాలాల్ మహరాజ్ అహింస, శాంతి, ప్రేమ మార్గాలను చూపారని.. ఆయన బాట అందరికీ ఆదర్శనీయమని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మద్దూర్‌లో శనివారం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే పట్నం గిరిజనులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బంజారా జాతి ఔనత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని.. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. గిరిజన తండాలకు పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గోపాల్, నాయకులు వీరారెడ్డి, సలీం పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

మూసాపేట, ఫిబ్రవరి 15: మండలంలోని జానంపేట అనుబంధ గ్రామం తాళ్లగడ్డకు చెందిన యువకులు శనివారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. జానంపేట కార్యకర్తల సమావేశానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే ఆల సమక్షంలో స్వచ్ఛందంగా తాళ్లగడ్డకు చెందిన నూతన ఓటర్లు పార్టీలో చేరుతామని ప్రకటించారు. దీంతో వారికి సంతోషంగా గులాబీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారిలో శ్రీకాంత్‌గౌడ్, చైతన్యగౌడ్, రాఘవేందర్‌గౌడ్, పవన్‌గౌడ్, శివకుమార్‌గౌడ్, రమేశ్, శ్రీకాంత్, సుదర్శన్, వేణుకుమార్, బాలు, భానుప్రకాశ్, రాకేశ్‌తోపాటు మరికొంత మంది యువకులు ఉన్నారు.

## పచ్చటి మొక్కే జననేతకు ఘనమైన కానుక



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ నవీన్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

- ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి15: పచ్చటి మొక్కే మా జననేతకు ఘనమైన కానుక అని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ రథసారథి, స్వరాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా శనివారం కొత్తకోటలో ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 17న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ జన్మదిన కానుకగా వృక్షార్చన, హరితబృహత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఆకాంక్షలు నెరవేర్చి, ఆత్మగౌరవ బావుటా ఎగరవేసి, స్వరాష్ట్రాన్ని సాధించి, బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన కేసీఆర్‌కు ఇవే మా పుట్టిన రోజు శుభాకాంక్షలు అని పేర్కొన్నారు. పసికూనగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని ఈరోజు దేశానికి తలమానికంగా నిలిపిన రాజకీయ చాణక్యుడు కేసీఆర్ అని.. ఇలాంటి విజయం సాధించడం ఏ ముఖ్యమంత్రికి సాధ్యపడదన్నారు. తెలంగాణ మోడల్‌కు యావత్ దేశమంతా సగర్వంగా జేజేలు కొట్టించి, వినువీధుల్లో తెలంగాణ ఆత్మగౌరవ పతాకను సగర్వంగా రెపరెపలాడించిన నాటి, నేటి ఉద్యమ నేతకు వృక్షార్చనతో పాదాభివందనం చేస్తూ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపాలని బీఆర్ఎస్ నాయకులు కొత్తకోటలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వామన్‌గౌడ్, విశ్వేశ్వర్, గుంత మౌనిక, మల్లేశ్, చెన్నకేశవరెడ్డి, ప్రశాంత్, రాములు, నెహ్రూ, నాగన్న, రవి, నరేశ్, వినోద్‌సాగర్ పాల్గొన్నారు.

**కేసీఆర్ పాలన మళ్లీ రావాలి..**

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 15: తెలంగాణ జాతిపిత, తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను వనపర్తి బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో తెలంగాణ పచ్చదనం, పాడిపంటలతో కళకళలాడిందని, అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. భవిష్యత్ తెలంగాణ అభివృద్ధికి కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. బీఆర్ఎస్ నాయకులు అశోక్, ప్రజాప్రతినిధులు నాగన్నయాదవ్, కంచె రవి, రహీం, హేమంత్, రాము, జోహెబ్ హుస్సేన్, హరీఫ్, క్రాంతి కుమార్, నీలంభాను, రఘు తదితరులు ఉన్నారు.

## ప్రియాంక గాంధీకి ప్రశ్నోత్తరాలు



ప్రియాంక గాంధీకి రాసిన ఉత్తరాలు చూపిస్తున్న విద్యార్థినులు

వడ్డేపల్లి, ఫిబ్రవరి15: ప్రియాంక గాంధీజీ మీరు ఇచ్చిన స్కూటీ హామీని ఎప్పుడు నెరవేరుస్తారని కోరుతూ శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రియాంక గాంధీకి పోస్టుకార్డులు రాశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో భాగంగా 18 ఏండ్లు నిండిన ప్రతి అమ్మాయికి ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటీ, మహిళలకు రూ.2,500 ఇస్తామని ప్రకటించి 14నెలలు గడుస్తున్నా.. హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. హామీలు నెరవేర్చే వరకు పోరాడతామన్నారు.

**స్కూటీలను వెంటనే పంపిణీ చేయాలి..**

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 15: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా 18ఏండ్లు నిండిన మహిళలకు ఇస్తామన్న ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీలు వెంటనే అమలు చేయాలని శనివారం బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మహిళా కళాశాల విద్యార్థినులు పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకుడు హేమంత్ ముదిరాజ్ మాట్లాడుతూ.. సరూర్‌నగర్ స్టేడియంలో 2023, మే 23న కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభలో యూత్ డిక్లరేషన్ పేరిట ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ మాయమాటలు చెప్పిందని, ఆమె మాటలు నమ్మి ఎన్నికల్లో యువత ఓటు వేస్తే 14నెలలు గడిచినా ఆ ఊసెత్తడం లేదని విమర్శించారు. హామీలు అమలు చేసేదాకా పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు, కళాశాల విద్యార్థినులు తదితరులు ఉన్నారు.




యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

- 50 కిలోల బస్తాలో కిలో 300 గ్రాముల తరుగు తీయడంపై మండిపాటు
- అయిజ సబ్ మార్కెట్ వద్ద ఆందోళన
- మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నేత


# కంది రైతుల కన్నెర్ర

అయిజ, ఫిబ్రవరి 15 : కంది రైతులు కన్నెర్ర చేశారు. కందుల కొనుగోళ్లలో పీఏసీసీఎస్ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అయిజ పట్టణంలోని సబ్ మార్కెట్ యార్డులో ఆందోళన చేపట్టారు. 50 కేజీల కందుల బస్తాకు సిబ్బంది కేజీ 300 గ్రా ముల తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్త చేశారు. సర్కారు నిబంధనల ప్రకారం 50 కేజీల బస్తాకు కేవలం 600 గ్రాములు అదనంగా సేకరించాల్సి ఉన్నప్పటికీ 700 గ్రాములు అదనంగా సేకరిస్తుండడంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. అదనంగా ఎందుకు సేకరిస్తున్నారని రైతులు ప్రశ్నిస్తే కొనుగోళ్లను నిలిపివేస్తున్నారని వాపోయారు. రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య మార్కెట్‌కు చేరుకుని మద్దతు తెలిపారు. పంటల కొనుగోళ్లలో రైతులకు నష్టం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ విషయమై మార్క్‌ఫెడ్ డీఎంతో ఫోన్‌లో మాట్లాడారు. 50 కేజీల బస్తాకు కేవలం 600 గ్రాములు తీయాలని సూచనలు చేశామని, అదనంగా తీస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి రైతుల ఆందోళన వద్దకు వచ్చి నిబంధనల మేరకు అదనంగా తీసుకుంటామని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కువగా ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించడంతో ఆయన కొనుగోళ్లను నిలిపివేస్తామని అక్కడి నుంచి జారుకున్నారు. సరైన సమాధానం రాలేదని పీఏసీసీఎస్ వద్దకు చేరుకుని రైతులు మళ్లా ఆందోళనకు దిగారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన అదనపు కందులను రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. అయిజలో జరుగుతున్న అవకతవకలపై కలెక్టర్, అదనపు కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్తామని పల్లయ్య చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మత్తాలి, మాధవ్, రైతులు తిప్పన్న, గోవిందమ్మతోపాటు పలువురు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేస్తున్న రైతులు, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

**రైతులను మంచుతున్నరు..**



కందుల కొనుగోళ్లలో రైతులను నిండా ముంచుతున్నరు. మద్ధతు ధరకు పంటను అమ్ముకుందామని వస్తే నిబంధనల పేరుతో ఎకరాకు 3 క్వింటాళ్లు కొంటామని, అమ్మిన కందులకు అదనంగా తీసుకుని రైతులకు నష్టం చేస్తున్నరు. అధికారులు కొనుగోళ్లు కేంద్రాలను తనిఖీ చేయకపోవడంతోనే కొనుగోలుదారులు అదనంగా తీసుకుంటున్నరు. అధికారులు తనిఖీ చేసి నిబంధనల ప్రకారం కొనుగోలు చేసేలా చూడాలి.

– తిప్పన్న, రైతు, వెంకట్రామనగర్, వడ్డేపల్లి మండలం

**మూడ్రోజులైనా కొంటలేరు..**

మూడ్రోజులైనా కందులను కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అరాసైనా కందులను కొనుగోలు చేయకపోవడంతో రాత్రనకా పగలనకా మార్కెట్‌లోనే పడిగాపులు కాయాల్సి వస్తుంది. వెంటనే కొనుగోలు చేసి, గోదాంలకు తరలిస్తే బాగుంటది. రైతులను ఇబ్బందులు గురి చేయొద్దు. సర్కారు నిబంధనల ప్రకారం వెంటనే కొనుగోలు చేసి రైతుల ఖాతాలకు నగదు జమ చేయాలి.

– గోవిందమ్మ రైతు, తూంకుంట, అయిజ మండలం

**నిబంధనల ప్రకారం కొనుగోళ్లు**

మార్క్‌ఫెడ్ నిబంధనల ప్రకారం కందులను కొనుగోలు చేస్తున్నాం. 50 కేజీల బస్తాకు కేజీ అదనంగా తీసుకుంటున్నం. రైతుల ఎదుటనే కందులను కొనుగోలు చేస్తున్నం. పిడికెడు కందులను సిబ్బంది అదనంగా తీసుకోరు. రైతులు ఆరోపించినట్లుగా ఎలాంటి చేతివాటం ప్రదర్శించడం లేదు. రైతులు ఆందోళన చేస్తే కొనుగోళ్లలో జాప్యమైతే రైతులే నష్టపోతరు. రైతులు సహకరిస్తే కొనుగోళ్లు వేగవంతం చేస్తం.

– మధుసూదన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్, అయిజ

## పెబ్బేరులో భారీ అగ్నిప్రమాదం

- రూ.80 లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా

పెబ్బేరు, ఫిబ్రవరి 15: పెబ్బేరులోని ఓ ఎలక్ట్రికల్, పీవీసీ పైపుల దుకాణంలో శనివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకొని భారీగా నష్టం సంభవించింది. పట్టణంలో ప్రధాన రహదారిపై ఉన్న లక్ష్మీ తిరుమల ఇంజినీరింగ్ అండ్‌ఎలక్ట్రికల్ దుకాణంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో షాపులోని సామగ్రితోపాటు, షాపు నిర్వహిస్తున్న భవనానికి కూడా తీవ్ర నష్టం జరిగింది. రూ.50లక్షల విలువైన సామగ్రి కాలి బూడిద కాగా.. రూ.30 లక్షల విలువైన భవనం దెబ్బతిన్నదని బాధితులు వాపోయారు. ఫైరింజన్లు వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సందర్శించి బాధితులను పరామర్శించారు.



షాపులో కాలిపోయిన సామగ్రి

### ఆర్డీఎస్‌లో తగ్గుతున్న నీటిమట్టం

అయిజ, ఫిబ్రవరి 15 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటిమట్టం క్రమేపీ తగ్గుతోంది. శనివారం ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 167 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 4.2 అడుగుల మేర నీటి నిల్వ ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో నిలిచిపోగా, అవుట్‌ఫ్లో 7,951 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 43.071 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1,633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి గానూ, ప్రస్తుతం 1612.65 అడుగులు ఉన్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

SVS హాస్పిటల్ మహబూబ్‌నగర్
ఉచిత వైద్య శిబిరం - Free Health Camp
17-02-2025 (సోమవారం) నుండి 22-02-2025 (శనివారం) వరకు
అడ్మిట్ అయిన పేషెంట్లకు, సాధారణ వైద్య పరీక్షలు ఉచితంగా చేయబడును.
> సాధారణ కాన్పులు మరియు స్త్రీ సంబంధిత వ్యాధులు గర్భ సంచి ఆపరేషన్, రొమ్ము పై గడ్డలు, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు మరియు శస్త్ర చికిత్సలు చేయబడును.
> విరిగిన ఎముకల శస్త్ర చికిత్సలకు ఉచిత వైద్య పరీక్షలతో ఆపరేషన్లు.
> చిన్న పిల్లల మెదడు, గుండె, నరాలు, కిడ్నీ, కంటి (Ophtal) ముక్కు, చెవి, గొంతు (ENT) మరియు ఎముకల రోగ నిర్ధారణ పరీక్షలతో వైద్యం.
> ఆస్తమా, దగ్గు, దమ్ము, అయాసము, నిమోనియా, బీడీ/సిగరెట్, పొగాకు తో కలిగే దీర్ఘ కాలిక ఊపిరితిత్తుల జబ్బులకు రోగ నిర్ధారణ పరీక్షలతో వైద్యం.
> చెవి, ముక్కు, గొంతు రోగ సమస్యలకు పరీక్షలు మరియు చికిత్సలు. NPCB లో అర్హులకు ఉచిత కంటి ఆపరేషన్లు.
> ఫిట్స్, మూర్ఛరోగం, దీర్ఘకాలిక తల, నరాల బలహీనత, కల్లు, సారాతో కలిగే సమస్యలకు నిర్ధారణ పరీక్షలతో వైద్యం.
> దీర్ఘ కాలిక చర్మ సంబంధిత వ్యాధులకు నిర్ధారణ పరీక్షలతో వైద్యం.
గమనిక : అన్ని రకాల వైద్య మరియు శస్త్ర చికిత్సలకు మందులు పేషెంట్లే భరించవలెను.
వివరాలకు : 6303444232, 7893888529 మొబైల్ పై సంప్రదించగలరు.

JEE - 2025 మెయిన్స్‌లో అక్షర ప్రభంజనం



JEE మెయిన్ టాపర్ చరణ్‌తేజ ను అభినందిస్తున్న అక్షర జూనియర్ కళాశాల యాజమాన్యం & అధ్యాపకులు
98.78 Percentile
(App.No.250310053604)
✤ సాధారణ విద్యార్థులను JEE టాపర్‌లుగా తీర్చిదిద్దుతున్న అకాడమి-అక్షర NEET/JEE అకాడమి
✤ స్థాపించిన 3వ సం॥లోనే అద్భుత ఫలితాలు
అక్షర జూనియర్ కళాశాల IIT-JEE/NEET ACADEMY
న్యూటౌన్, మహబూబ్‌నగర్. 9704411150, 9704611150